యువత మాట.. ఉద్యాన బాట

- క్షేత్ర స్థాయి శిక్షణలో ఉద్యాన విద్యార్థులు
- రైతుల పర్యవేక్షణలో నాలుగు మాసాలు
- వృత్తిపరంగా భవిష్యత్తులో ప్రయోజనం



శాస్త్రవేత్తల పర్యవేక్షణలో అజొల్లా తయారీపై శిక్షణ పొందుతున్న విద్యార్థులు



ట్రేలలో విత్తనాలు నాటుతున్న విద్యార్థులు

నల్లజర్ల: ఏ వృత్తి విద్యార్థులైనా తరగతి గదిలో నేర్చుకున్న పాఠాలకు క్షేత్ర స్థాయిలో అనుభవం తోడైతేనే ఆ విద్యకు సార్థకత చేకూరుతుంది. పాఠ్యాంశాలకు, క్షేత్ర స్థాయిలో అమలుకు చాలా వ్యత్యాసం ఉంటుంది. వీటిని సమన్వయపర్చడానికి బీఎస్సీ చివరి సంవత్సరం చదువుతున్న ఉద్యాన విద్యార్థులకు గ్రామీణ కృషి అనుభవ కార్యక్రమాన్ని భాగంగా చేశారు. ఇందులో భాగంగా డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పార్వతీపురానికి చెందిన 22 మంది విద్యార్థినులు మార్చి నుంచి జూన్ వరకు నాలుగు మాసాల పాటు నల్లజర్లలో అనుభవ శిక్షణ పొందుతున్నారు. మగ విద్యార్థులను పెద్దాపురం మండలానికి కేటాయించారు. గ్రామానికి ఆరుగురు చొప్పున తూర్పుచోడవరం, నల్లజర్ల, దూబచర్ల, తెలికిచెర్లలో రైతుల వద్ద పంట సాగు ప్రారంభం నుంచీ, రైతులు అనుసరిస్తున్న విధానాలపై అధ్యయనం చేయడంతో పాటు, శాస్త్రీయ సాగుపై వారికి అవగాహన కలిగిస్తున్నారు. ఈ నాలుగు మాసాల్లో రైతులు చేపట్టిన వివిధ పంటలు విత్తనం వేసినప్పటి నుంచి, రైతు చేపట్టే అన్ని కార్యక్రమాలు పర్యవేక్షిస్తారు. పంటకు సంబంధించి విత్తు నాటింది మొదలు.. పంట దిగుబడులు వచ్చే వరకు పలు దశలలో రైతన్నల కృషిని తెలుసుకుంటున్నారు. తెగుళ్లు, కలుపు నివారణ, పురుగు మందు వినియోగం, చివరకు పంట కోత వరకు రైతుకు ఎంత ఖర్చయింది, ఎంత మిగిలింది పర్యవేక్షిస్తారు. అంతేకాకుండా రైతు కుటుంబంపైనా, రైతుకు ఉన్న అనుబంధ పరిశ్రమలు పశు పోషణ, కోళ్ల తదితర అంశాలపైన ప్రాజెక్ట్ వర్క్ చేసి, అన్ని కోణాల్లో అన్ని అంశాలపై విశ్లేషణలతో పాటు పని అనుభవాన్ని నేర్చుకుంటారు. జూన్ 17తో ఈ శిక్షణ కార్యక్రమం పూర్తవుతుంది. వీరు పరిశీలించిన అంశాలు వారి మాటల్లోనే..

గిట్టుబాటు ధరలు లేవు



ఈ ప్రాంతంలో అత్యధికంగా పండించే ధాన్యం, కూరగాయలు, అపరాల సాగు, ఉద్యాన పంటలకు గిట్టుబాటు ధరలు లేవని రైతులు చెబుతున్నారు. దిగుబడులు ఆశాజనకంగా ఉంటే.. మార్కెట్‌లో ధర లేకపోవడం, ధరలు ఉన్నపుడు దిగుబడులు లేకపోవడం, దీన్ని సమన్వయం చేయాల్సి ఉంది. పైర్ల సాగు విస్తీర్ణంపై రైతులకు అవగాహన కలిగించాల్సి ఉంది. మార్కెటింగ్ వ్యవస్థను పటిష్టపర్చాల్సి ఉంది. తద్వారా దిగుబడి, డిమాండ్ల మధ్య సమతుల్యత సాధ్యమవుతుంది. వ్యవసాయ రంగం లాభసాటిగా ఉంటుంది.

– సీహెచ్ మేరీ, ఉద్యాన విద్యార్థిని, దోసపాడు, ఏలూరు జిల్లా

పంటల సాగుపై అవగాహన



రైతులతో పొలాలకు వెళ్లినపుడు వివిధ పంటల సాగులో అనేక విషయాలు తెలుసుకుంటున్నాం. రైతులు కూడా మాకు అన్ని విషయాలు కూలంకుశంగా వివరిస్తున్నారు. మాకున్న సందేహాలను నివృత్తి చేసుకుంటున్నాం. గ్రామస్తులు కూడ మాపై చక్కటి ఆప్యాయత చూపుతున్నారు. సాంకేతిక విద్య క్షేత్ర స్థాయి శిక్షణ మాకు భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుంది.

– ఎల్ సంధ్య, ఉద్యాన విద్యార్థిని, పొందూరు

సర్వేతో సమగ్ర సమాచారం



గ్రామాలలో ఉన్న రైతు సేవా కేంద్రాల ద్వారా ప్రభుత్వం రైతులకు ఏ విధమైన మేలు చేస్తుందో, వీటి వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలు తెలుసుకుంటున్నాం. ప్రతి విద్యార్థి 40 మంది రైతులను సర్వే చేసి, పొలంబడి, డ్రోన్ వినియోగం, నీటి పొదుపు, మొక్కలు నాటడం, మట్టి నమూనాల సేకరణపై అవగాహన కలిగిస్తున్నాం.

– పి.శ్వేత, ఉద్యాన విద్యార్థిని, విజయనగరం

క్లుప్తంగా

నేడు క్యాంపస్ ఇంటర్వ్యూలు

కొవ్వూరు: పట్టణంలో ఏబీఎస్ అండ్ పీఆర్ఆర్ కళాశాలలో శుక్రవారం లారెస్ లాబ్స్ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రామ్మోహనరావు తెలిపారు. ఎమ్మెస్సీ, ఎం ఫార్మసీ, బీ ఫార్మసీ, బీఎస్సీ కెమిస్ట్రీ, డిప్లమో ఎలక్ట్రికల్, మెకానికల్ సబ్జెక్టుల్లో 2024–25 సంవత్సరంలో ఉత్తీర్ణత సాధించిన వారు ఈ ఇంటర్వ్యూలకు అర్హులన్నారు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి ఇంటర్వ్యూలు జరుగుతాయని చెప్పారు.

భద్రాచలానికి ప్రత్యేక బస్సులు

కొవ్వూరు: శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలానికి ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని ఆర్టీసీ డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ తెలిపారు. సీతారాముల కల్యాణ మహోత్సవానికి తరలివెళ్లే భక్తులు ఈ స్పెషల్ బస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాల కోసం ఆర్టీసీ డిపోలో సంప్రదించాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం శుక్రవారం మధ్యాహ్నం నుంచి భక్తులకు ఈ ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు.

నేడు, రేపు ఇంటర్వ్యూలు

ఉండ్రాజవరం: స్వయం ఉపాధి కోసం వివిధ కార్పొరేషన్ల నుంచి రుణాలు పొందేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్ర, శనివారాలు ఇంటర్వ్యూలు జరుగుతాయని ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు గురువారం తెలిపారు. మండలంలో బీసీ, కాపు, ఆర్థికంగా వెనుబడిన తరగతుల నుంచి స్వీకరించిన 885 మంది దరఖాస్తు దారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. ఈ ఇంటర్వ్యూలకు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

సారా తయారీ, రవాణా నేరం



తాడిపర్రులో అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ అధికారులు, ప్రజాప్రతినిధులు

ఉండ్రాజవరం: సారా తయారు చేసినా, రవాణా చేసినా శిక్షార్హులని నిడదవోలు ఎక్సైజ్ సీఐ ఆర్.జయరాం సతీష్‌బాబు అన్నారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని తాడిపర్రు గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ కరుటూరి నరేంద్ర అధ్యక్షతన గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. నాటు సారా వలన కలిగే అనర్థాలను వివరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, సారా తయారీ, రవాణాపై సమాచారం తెలిసిన వారు 14405 టోల్ ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వీరభద్రం, పంచాయతీ కార్యదర్శి పి.ముసలయ్య, ఎస్సై బాలాజీ, కానిస్టేబుళ్లు కె.శ్రీనివాసు, ఎం.రవికుమార్, బీవీఎం.కుమారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధుల నియంత్రణకు చర్యలు

నల్లజర్ల: కీటక జనిత వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని మలేరియా సబ్‌యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. నల్లజర్ల పీహెచ్‌సీలో డాక్టర్లు గంగాధరరావు, సిరాజుద్దీన్ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశలకు గురువారం అవగాహన కల్పించారు. ముందస్తు కార్యాచరణ ప్రణాళికలను వివరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఈనెల 15 నుంచి జూన్ 15 వరకూ మొదటి విడత, జూలై 15 నుంచి ఆగస్టు 31 వరకు రెండో విడత దోమల మందును పిచికారీ చేయించాలన్నారు. గ్రామాల్లో ప్రతి వారం వెక్టార్ కంట్రోల్ హైజీన్ ప్రోగ్రామ్‌ను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ప్రతి ఆశ గృహ సందర్శనలో గుర్తించిన శానిటేషన్ పరిస్థితులను యాప్‌లో నమోదు చేయాలన్నారు. గత ఏడాది కేసులు నమోదైన గ్రామాల్లో ఫీవర్ సర్వే, ఏఎల్‌ఓ ఆపరేషన్ విధిగా చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ప్రసాదరావు పాల్గొన్నారు.

7న ఎంపీ, ఎమ్మెల్యేల పర్యటన

నల్లజర్ల: ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఈనెల 7వ తేదీన మండలంలో పర్యటించనున్నారని ప్రకాశరావుపాలెం ఉప సర్పంచ్ యద్దనపూడి బ్రహ్మరాజు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో పలు రోడ్ల, కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన చేస్తారన్నారు. ప్రకాశరావుపాలెంలో సీసీ రహదారులను ప్రారంభిస్తారన్నారు.

తల్లీకూతుళ్లను కొట్టిన ఇద్దరిపై కేసు

కొవ్వూరు: తల్లీకూతుళ్లను కొట్టిన కేసులో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ హెడ్ కానిస్టేబుల్ వి.లలిత తెలిపారు. స్థానిక అచ్చాయమ్మ కాలనీకి చెందిన మిండల లక్ష్మి తల్లికి రూ.50 వేలు అందాయని తెలుసుకుని గురువారం ఆమె అన్న గంగరాజు, వదిన ముత్తమ్మ ఇంటికి వచ్చారు. తల్లిని రూ.50 వేల ఇవ్వాలని గంగరాజు అడగ్గా, అందుకు ఆమె నిరాకరించింది. దీంతో తల్లిని, చెల్లి లక్ష్మిని గంగరాజు, ముత్తమ్మ కొట్టి గాయపరిచారు. ఇద్దరూ చికిత్స కోసం కొవ్వూరు ప్రభుత్వాస్పత్రిలో చేరారు. ఆస్పత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ లలిత తెలిపారు.

పాలిటెక్నిక్ ఎంట్రన్స్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎంఈవో, పూర్వ విద్యార్థులు

తాళ్లపూడి: పదో తరగతి తరువాత విద్యార్థులు పాలిటెక్నిక్ వంటి కోర్సుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడం ద్వారా ఉన్నత స్థానాల్లో స్థిరపడవచ్చని ఎంఈవో సీహెచ్ బాలామణి అన్నారు. వేగేశ్వరపురం ప్రభుత్వ, పెద్దేవం జెడ్పీ ఉన్నత పాఠశాలల వద్ద గురువారం జీఎఫ్ ఫౌండేషన్ సహకారంతో పూర్వ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ ఎంట్రన్స్‌పై అవగాహన కల్పించారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు పాలిటెక్నిక్ పరీక్షను ఎలా రాయాలి, మంచి ర్యాంకు ఎలా సాధించాలనే అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘ సభ్యులు కైగాల శ్రీనివాస్, అడ్డాల డేవిడ్‌రాజు, పరస రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ దేవరపల్లి ఈఈ ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు అంతరాయం కలుగుతుందని చెప్పారు. 11 కేవీ సంత మార్కెట్ ఫీడర్, హెడ్ క్వార్టర్ ఫీడర్ల పరిధిలో ప్రాంతాలకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

సర్వేయర్ తప్పులతో మాకు చిక్కులు



తమ సమస్యలను కలెక్టర్ ప్రశాంతికి వివరిస్తున్న రైతులు

దేవరపల్లి: గతంలో రీసర్వే సందర్భంగా గ్రామ సర్వేయర్ చేసిన తప్పిదాలతో తమకు చిక్కులు వచ్చాయని పలువురు రైతులు ఆరోపించారు. దేవరపల్లి మండలం కురుకూరు భూముల రీ సర్వేలో తప్పులు జరిగాయంటూ ఇటీవల ఆ గ్రామ రైతులు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆమె గురువారం గ్రామంలో పర్యటించి, రీ సర్వే పనులను పరిశీలించారు. సంబంధిత రికార్డులను పరిశీలించి, సర్వే సిబ్బందిని వివరాలడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ సచివాలయంలో రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా రైతులు కొయ్యలమూడి శ్రీనివాస్, భాస్కరరావు, కొయ్యలమూడి అచ్యుతరావు, కొయ్యలమూడి గాంధీ, కలగర శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ, తమకు ఎటువంటి నోటీసులూ ఇవ్వకుండా ఇచ్చినట్లు రికార్డుల్లో రాసుకుని సర్వే నిర్వహించారని ఆరోపించారు. నిబంధనల ప్రకారం గ్రామసభ నిర్వహించకుండానే నిర్వహించినట్లు రికార్డుల్లో నమోదు చేశారన్నారు. సర్వేయర్ తప్పిదాలతో గ్రామ రెవెన్యూ చిన్నాభిన్నమైందని, ఒకరి భూమి మరొక రైతుకు నమోదు చేశారని తెలిపారు. రికార్డులను సరి చేసి తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ, రీ సర్వేలో తప్పులు ఎందుకు జరిగాయని వీఆర్‌ఓ, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్, మండల సర్వేయర్‌లను ప్రశ్నించారు. సిబ్బంది నిర్లక్ష్యం వల్ల గ్రామంలో సమస్య ఏర్పడిందని, రైతులకు నోటీసులు ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. వెబ్‌ల్యాండ్-2లో జరిగిన తప్పులను తొలగించి, కొత్త వెబ్‌ల్యాండ్ రికార్డు తయారు చేస్తామని రైతులకు చెప్పారు. కొత్తగా సేఫ్ ఫైల్ తయారు చేసి, గ్రామసభ నిర్వహించి, రైతులకు చదివి వినిపించాలని సర్వే అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియ వేగంగా జరగాలని స్పష్టం చేశారు. ల్యాండ్ పార్సిల్ మ్యాప్(ఎల్‌పీఎం)ను సరి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం రెండు సర్వే బృందాలు పని చేస్తున్నాయని, వీటిని మూడుకు పెంచుతామని చెప్పారు. రీ సర్వేలో తప్పులను సరిదిద్ది, రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రశాంతి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, కొవ్వూరు ఆర్డీఓ రాణి సుస్మిత, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే డి.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ ఎం.శ్రీనివాస్, సర్పంచ్ కొయ్యలమూడి అనంతలక్ష్మి, రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర భూ నిర్ధారణ కోసమే రీ సర్వే

జేసీ చిన్నరాముడు



దొమ్మేరు గ్రామసభలో మాట్లాడుతున్న జేసీ చిన్నరాముడు

కొవ్వూరు: భూముల సమగ్ర కొలతల నిర్ధారణ కోసమే క్షేత్ర స్థాయిలో రెండో దశ రీ సర్వే నిర్వహిస్తున్నామని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు అన్నారు. గురువారం దొమ్మేరు గ్రామంలో రీ సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన గ్రామ సభలో జేసీ మాట్లాడారు. భూముల యజమానులు, రైతులు వ్యక్తం చేసిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని, సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో కూడిన రీ సర్వే చేస్తున్నామన్నారు. క్షేత్ర స్థాయిలో అత్యంత పారదర్శకంగా సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్షేత్ర స్థాయిలో తనిఖీలు, రీ సర్వేలో తగిన వివరాలు, రికార్డులు అందజేసి అధికారులకు సహకరించాలని ఆర్డీవో రాణి సుస్మిత కోరారు. తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, సర్పంచ్ తానేటి కుమారి, సర్వే బృంద సభ్యులు పాల్గొన్నారు.

రేపు జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ



పెద్దేవంలో విగ్రహావిష్కరణ వివరాలను తెలుపుతున్న సంఘ నాయకులు

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవం సినిమా హాల్ సెంటర్ వద్ద శనివారం మాజీ ఉప ప్రధాని దివంగత డా.బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ జరుగుతుందని డా.బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహ నిర్మాణ, యువజన సేవా సంఘ సభ్యులు తెలిపారు. గ్రామంలో పార్టీలకతీతంగా అరుంధతీయ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమ ఆహ్వాన పత్రాలను గురువారం వారు ఆవిష్కరించారు. గ్రామంలో 50 ఏళ్ల క్రితమే విగ్రహ ఏర్పాటు జరిగిందని, ప్రస్తుతం పునః నిర్మాణం చేసినట్టు వివరించారు. విగ్రహావిష్కరణలో ఆయన వారసులు, లోక్ సభ మాజీ స్పీకర్ మీరాకుమార్ కుమారుడు డా.అన్షుల్ అవిజిత్ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, తిగిరిపల్లి గోపి, సిర్రా గంగారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఆదర్శ రైతులకు సత్కారం



ఆదర్శ రైతులను సత్కరిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు, డీపీఎం తాతారావు

దేవరపల్లి: ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధిస్తూ ప్రజలకు ఆరోగ్యకర ఆహార ఉత్పత్తులను అందిస్తున్న పలువురు ఆదర్శ రైతులను జిల్లా వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయ విభాగం అధికారులు ఘనంగా సత్కరించారు. స్థానిక పొగాకు బోర్డు కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో రైతులను సన్మానించారు. దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాల్లోని ఆదర్శ రైతులు గద్దే మునేశ్వరరావు, చాపల సత్యవతి, గెడా జోగేంద్ర ప్రసాద్, గద్దే హరిచంద్ర ప్రసాద్, కాంట్రేగుల సూర్యారావు, మామిడిపల్లి వెంకటేశ్వరరావు, ఉనమటకల దుర్గా ప్రసాద్, దాపర్తి రామకృష్ణ, పి.బ్రహ్మానందం, సురేష్, గద్దే రమాదేవిలను జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు, ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజరు బొర్రా తాతారావు ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఏడీఏ సీ చంద్రశేఖర్, మూడు మండలాల వ్యవసాయ అధికారులు కె.విజయ్, కె.కమల్‌రాజ్, బి.రాజారావు, ప్రకృతి వ్యవసాయ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

దా'రుణం'గా.. ఇంటర్వ్యూలు

- స్వయం ఉపాధి రుణాలకు తరలివచ్చిన అభ్యర్థులు
- కనీస సదుపాయాలు కల్పించని అధికారులు
- మంచినీటికి అల్లాడిన జనం
- సొమ్మసిల్లి పడిపోయిన ఓ నిరుద్యోగి



నిడదవోలు మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలకు తరలివచ్చిన అభ్యర్థులు



మున్సిపల్ కార్యాలయం వద్ద ఎండలో వేచి చూస్తున్న అభ్యర్థులు



సొమ్మసిల్లి పడిపోయిన నిరుద్యోగి

నిడదవోలు: ఉన్న ఉద్యోగాలు కాస్తా పీకేస్తున్నారు. కొత్త ఉద్యోగాలా ఏమీ లేవు. ఏదో ఊరిస్తున్నట్టుగా ఉపాధి రుణాలిస్తామంటూ అధికారులు ప్రకటించేసరికి.. పొట్టకూటి కోసం ఏదో ఒకటి చేసుకోవాలి కదా అనుకుంటూ నిరుద్యోగులు పోటెత్తారు. దిమ్మ తిరిగే ఎండను సైతం లెక్క చేయకుండా పడిగాపులు పడ్డారు. అధికారులు కనీస ఏర్పాట్లు చేయలేదని అభ్యర్థులు మండిపడ్డారు. మంచినీరూ దొరక్కపోవడంతో, ఓ నిరుద్యోగి ఎండధాటికి సొమ్మసిల్లి కుప్పకూలాడు. వివరాల్లోకి వెళితే..

స్వయం ఉపాధి రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి నిడదవోలు మున్సిపల్ కార్యాలయంలో గురువారం లబ్ధిదారులను ఎంపిక చేయడానికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి మాట్లాడుతూ, పట్టణంలో 28 వార్డులకు గాను 79 యూనిట్లు కేటాయించారు. వీటి కోసం 906 మంది దరఖాస్తు చేయగా, 530 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారన్నారు. పట్టణంలో ఇండియన్, ఎస్‌బీఐ, కెనరా, గోదావరి గ్రామీణ, యూనియన్, యూబీఐ బ్యాంకులకు చెందిన మేనేజర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు హాజరై, అభ్యర్థులను ఇంటర్వ్యూలు చేశారు. మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పర్యవేక్షించారు.

కనీస సదుపాయలు కరవు

స్వయం ఉపాధి రుణాల కోసం పట్టణంలో 28 వార్డులకు 906 మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం మున్సిపాలిటీకి కేవలం 79 యూనిట్లు కేటాయించింది. గురువారం లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించిన ఇంటర్వ్యూలకు నిరుద్యోగులు పోటెత్తారు. క్యూలో వేచి ఉండలేక ఇబ్బందులు పడ్డారు. అభ్యర్థులందరికీ ఒకే రోజు ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. ఇంటర్వ్యూలకు అభ్యర్థులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. వీరికి అక్కడ కనీస సదుపాయాలు లేక ఇబ్బందులు పడ్డారు. ఎండలు మండుతున్నా, వేసవి తాపానికి మంచినీటి కోసం అభ్యర్థులు అల్లాడిపోయారు. అధికారులు కనీసం మంచినీటి సదుపాయం కూడా ఏర్పాటు చేయలేదు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశ హాలులో ఇంటర్వ్యూలు నిర్వహించారు. అభ్యర్థులు అధిక సంఖ్యలో హాజరుకావడంతో మున్సిపల్ కార్యాలయం కిక్కిరిపోయింది. మున్సిపల్ కార్యాలయం వద్ద షామియానా ఏర్పాటు చేయకపోవడంతో నిరుద్యోగులు ఎండలో మగ్గిపోయారు. క్యూలో నిలబడలేక ఓ అభ్యర్థి సొమ్మసిల్లి కిందపడిపోయాడు. మంచినీటి కోసం నానా అవస్థలు పడ్డారు.

ఇంటర్వ్యూలకు 251 మంది హాజరు

చాగల్లు: చాగల్లు మండల పరిషత్ కార్యాలయములో రెండో రోజు స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీఓ ఆర్.శ్రీదేవి, యూనియన్ బ్యాంకు మల్లవరం బ్రాంచి మేనేజర్ ఆధ్వర్యంలో కలవలపల్లి, మార్కొండుపాడు, నందిగమపాడు, ఎస్.ముప్పవరం, ఊనగట్ల పంచాయతీల పరిధిలోని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు జరిగాయి. ఆయా పంచాయతీల నుంచి రుణాల కోసం 332 దరఖాస్తులు రాగా, గురువారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు 251 మంది హాజరైనట్లు ఎంపీడీవో శ్రీదేవి తెలిపారు.

మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గారావు

దేవరపల్లి: వేసవిలో మంచినీటి ఎద్దడి నివారణకు గాను అదనపు మోటార్ల కొనుగోలుకు ప్రతి గ్రామ పంచాయతీకి నిధులు మంజూరు చేస్తున్నట్టు ఎంపీపీ కేవీకే దుర్గారావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఆర్‌డబ్ల్యూఎస్, గృహనిర్మాణ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు మండల పరిషత్ నిధులు రూ.20 లక్షలు మంజూరు చేసినట్టు ఆయన వివరించారు. ఈ నిధులతో అదనపు మోటార్లు కొనుగోలు చేసి ప్రజలకు వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. మంచినీటి ట్యాంకులను విధిగా శుభ్రం చేయాలని, పైపులైన్ల లీకేజీలను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేసి ప్రజలకు మంచినీటిని సరఫరా చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. వచ్చే మూడు నెలలు ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు సమన్వయంతో పనిచేసి నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. దేవరపల్లి-యాదవోలు రోడ్డులో మండల పరిషత్ నిధులు రూ.10 లక్షలతో బోరు వేయగా కాంట్రాక్టర్ జాప్యం వల్ల మోటారు ఏర్పాటు కాలేదన్నారు. బోరు వద్ద షెడ్డు నిర్మాణం, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అదనంగా రూ. 3.50 లక్షలు మంజూరు చేసినట్టు ఆయన వివరించారు. సమావేశంలో ఎంపీడీఓ ఎస్. వేణుగోపాల్ రెడ్డి, ఈఓపీఆర్డీ వై. రాజారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బీఆర్ఎస్ కుమారి, గృహనిర్మాణ శాఖ ఏఈ డి.ధర్మారావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైభవంగా అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ఠ



విగ్రహ పునః ప్రతిష్ఠకు హాజరైన భక్తులు



ఊనగట్లలో పుంతలో ముసలమ్మ అమ్మవారు

చాగల్లు: ఊనగట్ల గ్రామంలో ఉన్న పుంతలో ముసలమ్మ(కనకమహాలక్ష్మి) అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. ఇటీవల నూతనంగా నిర్మించిన ఆలయంలో అమ్మవారి నూతన విగ్రహాన్ని వేద మంత్రోచ్ఛరణ, మంగళవాయిద్యాల నడుమ వేద పండితులు శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన జరిగింది. ఆలయ కమిటీ ఏర్పాట్లు పర్యవేక్షించింది.